# బిగి కౌగిలి ★

రచన :
శ్రీ జంగంపల్లి లక్ష్మీరాజమ్.

"జోరుగా... హుషారుగా.. షికారు పోదామా?..."

అని ఈల పాట పాడుకుంటూ ఆఫీసులో అడుగు పెట్టాడు నటవర్.

పెట్టాడో, లేదో యమధర్మరాజులాగా అటెండర్ ప్రత్యక్షమై, "అయ్యగారు తమర్ని పిలుస్తున్నారు" అని కోర్టులో జడ్జీ తీర్పు ఇచ్చినట్లు యిచ్చాడు. "ఏం చేస్తాడు పాపం!"

ఆఫీసర్ ముందు రెండు చేతులు కట్టుకొని వణకిపోతూ నక్క వినయాలతో లేని చిరునవ్వు తెచ్చుకుంటూ... "నమస్కారం సార్! పిలిచారట" అని నసిగాడు మన హీరో.

అర్జంట్ కేస్ ఒకటి వచ్చింది. ఈ సాయంత్రంలోగా "పుటప్" చెయ్యి.

"నీకు ఏదైనా డౌట్స్ వస్తే, హెడ్‌ను అడుగు తెలిసిందా?" "మోస్ట్ అర్జెంట్ ఎస్. యుకెన్ గో" అని టకటక చెప్పాడు. పిల్లిలా తల వంచుకొని తుర్రున తన సీట్లోకి వచ్చి కూర్చున్నాడు.

ఆఫీస్ వాతావరణం అంతా గంభీరంగా యుంది. గడబిడ ఏమి లేదన్నట్లు తోచింది. అసలు దీని కంతకు ఒకే ఒక కారణం? ఆఫీస్‌కు బయలుదేరే ముందు శ్రీమతి కలిపి యిచ్చిన "కాఫీ"లో పంచదార తక్కువ ఐంది. అందుకే ఈ ఆఫీసర్ గాడి శాపనార్ధాలూ... "అసలు ఎన్ని గుండెలు ఉండాలి? ఒక కిసీనియర్ క్లర్కు" ఇచ్చే రెస్పెక్ట్ నా? ఎంత అర్జంటైతే మాత్రం, మెల్లిగా చెప్పవచ్చుగా! కొంపలంటుకు పోవడం లేదు కదా! అనుకుంటూ ... కేసుకు సంబంధించిన ఫైల్సు ముందర ఉంచాడు. స్టడీ చేసి డ్రాఫ్ట్ ఆలోచించడం మొదలెట్టాడు తికమకపడి ఎలాగో పతాక సన్నివేశంలా ప్రక్కన వున్న హెడ్ దగ్గర పెట్టాడు.

"లంచ్ టైం కాబోలు!" అందరూ కేంటీన్‌లో వున్నారు. అక్కడకు నటవర్ వెళ్ళాడు.

"అవునూ! నటవర్... ఆఫీసర్ మిమ్మల్ని ఎందుకు పిలిచారు?" అడిగారు తోటి స్టాఫ్ అంతా రామాయణం అంతా ఏకరువు పెట్టాడు వాళ్ళముందు.

"ఓకే బాబూ! కేసు కంప్లీట్ చేశా!" "బాస్ చాలా ఉగ్రరూపం దాల్చాడు!" అని అవతారం చెబుతున్నాడు.

మొత్తానికి కేసు ఆఫీసర్ ముందు కెళ్ళింది. ఆఫీసర్ చదివి నటవర్‌ను చాలా మెచ్చుకున్నాడు. "ఐస్"లా కరిగిపోయాడు నటవర్. అలాగే టైపు చేయించి డెస్పాచ్ సెక్షన్‌లో ఇచ్చాడు.

నటవర్ టైం చూసుకున్నాడు. సమయం సరిగా గం॥ 4-30 అవుతుంది. అప్పుడుగాని అతనికి శ్రీమతి చెప్పిన ఒక ముఖ్య విషయం జ్ఞాపకం రాలేదు.

మా శ్రీమతి రోజా లెండి! గుండ్రటి ముఖం, ఆకర్షించే కళ్ళు, గులాబి బుగ్గలు, పొడుగా పెంచుకొన్న ఆ వాలు జడ, చక్కని అంగసౌష్టవం కుందనం బొమ్మలా ఉంటుంది. "అబ్బ! ఇక వర్ణించలేను. నాకే వొళ్ళు జల దరిస్తుంది." ఆఁ...! అన్నట్టు మరచాను.. మా శ్రీమతి ఇవ్వాళ 'పిక్చర్ ప్రోగ్రామ్' వేసింది. "ఆఫీసునుండి తొందరగా రెమలండి. లేటు రావద్దు సుమా!" అంటూ లోపలికెళ్ళింది. అన్నింటికి గంగిరెద్దులా తల వూపాడు మన హీరో నటవర్.

"ఏరా! నటవర్! అంత పరధ్యానం ఐతే ఏలా గురా? ఏమిట్రా ఈ పగటికలలు? తొందరగా వెళ్ళి డెస్పాచ్ అయిందో, లేదో, చూడగా బాబూ! ప్రక్క సీట్లో వున్న సుబ్బారావు జ్ఞాపకం చేశాడు.

చకచకా ఆఫీసు పనులు ముగించుకొని బయట పడ్డాడు నటవర్. పాపం! చిన్ననాటి స్నేహితుడు 'నవీన్' లేక లేక కలిసాడు. పిచ్చాపాటి మాట్లాడుకుంటూ హోటల్ 'ద్వారక'కు దారి తీసారు. కాఫీలు సేవించారు. నటవర్‌కు మళ్ళీ జ్ఞాపకానికొచ్చింది శ్రీమతి.

"సారీ! బ్రదర్! నేను తొందరగా ఇంటికి వెళ్ళాలిరా! ఏమి అనుకోవద్దు" అని ఇంటి ముఖం పట్టాడు కాళ్ళు ఈడ్చుకుంటూ...

నటవర్ వాళ్ళ స్ట్రీట్‌లోకి వచ్చాడు. "ఆశ్చర్యము?! ఇంటికి కప్ప తాళం! హాతోస్మి!! తాళం ఉండటం ఏమిటీ?" ... ఈ పాటికి "శ్రీమతిగారు

చక్కగా ముస్తాబై, బ్లూవాయిల్ చీర ధరించి, అదే కలర్ జాకెట్‌తో, చిలిపి కళ్ళతో, ఆపిల్లాంటి చెక్కిళ్ళతో, పాంచాలిని మించిన కురులతో, వాలు జడ నిండా చేమంతి పూలతో, నన్ను సాదరంగా ఆహ్వానిస్తుందేమో యంటే ఇదేమి అపశకునం?" ... అంటూ విస్తుపోయాడాక్షణం.

"అసలు తాళాలు చేసే కంపెనీ వారికి బుద్ధి ఉండక్కర్లా! స్ట్రయిక్ చేస్తే బాగుండును. తాళాలు దొరక్క శ్రీమతిగారు ఇంట్లోనే ఉండేది. సరేలే! ప్రక్కింటి 'అత్త' గారిని అడిగితే పోలా! వెనక ఓ సారి ఓ కవి చెప్పినట్లు "ఇలలో ఇంతిని నమ్మరాదూ..." మరి దేన్ని నమ్మడమో! ఆ వీరబ్రహ్మంగారికే తెలియాలి..."

అత్తగారిని అడిగితే తనకు తెలియదు అని సమాధానం యిచ్చింది. "ఎక్కడికెళ్ళిందబ్బా! నాతో చెప్పకుండా ఎక్కడకు వెళ్ళదు మరి బంధువులు ఎవరైనా వచ్చారో...ఏమో..." అనుకుంటూ నటవర్ బీచ్ వైపు దారి తీసాడు.

సాయంత్రం వాతావరణం ఎంతో హాయిగా వుంది. పచ్చని గడ్డి, రకరకాల పూలచెట్లు, పువ్వుల పరిమళాన్ని బీచ్ అంతా వెదజల్లుతూ వచ్చేవారిని ఇట్టే ఆకర్షిస్తుంది. 'సూర్య బింబం' చిన్నారి పాప వోలె అమ్మా! అమ్మా! అని ఏడుస్తూ తల్లిని చేరటానికి ఉబలాట పడుచున్నాడు. పాపం! ఆ తల్లి రవికుమారున్ని అక్కున చేర్చుకుంది. చీకట్లు కమ్ముకొస్తున్నవి.

బెంచీపై కూర్చొని వున్నాడు నటవర్. అకస్మాత్తుగా కాలేజీలో పరిచయమైన 'శిల్ప' గుర్తొచ్చింది. 'ప్రేమనగర్' అక్కినేని నాగేశ్వరరావులా ఫోజు పెట్టి "శిల్పా! నేనెంత అన్యాయం చేశాను. నన్ను క్షమించు! ఈ మందభాగ్యుణ్ణి క్షమిస్తావా?" అని తనలో తను గొణుక్కున్నాడు.

అవి కాలేజీ రోజులు. అప్పట్లో శిల్ప చాలా అందంగా యుండేది. ఒక్కరోజు శిల్పను చూడకుంటే తనకు నిదరపట్టేదికాదు. ఒకనాడు స్నేహితులతో పందెం కట్టాడు నటవర్, "శిల్పను గాఢంగా కౌగలించుకుంటానని..."

ఒక రోజు ప్రైవేటు క్లాస్ వలన లేటు అయిన శిల్ప నడుచుకుంటూ వస్తుంది. చెట్టువద్ద నీడను చూసి రెండడుగులు ప్రక్కకు వేసింది. తరువాత వెనుదిరిగి చూసింది. అప్పుడే నటవర్ నడచి వస్తుండడం గమనించింది. శిల్పకు ధైర్యం వచ్చింది. తొందరగా పరుగెత్తి నటవర్‌ను బిగియార కౌగలించుకుంది. ఆ తీయని సుషుప్తిలో తనివి తీరా శిల్పను ముద్దుల మూటలో నింపి మరీ గట్టిగా నొక్కి పట్టి కౌగలించుకుంటున్నాడు.

"అబ్బ! వదలండీ! ఏమండీ! మిమ్మల్నే. ఏమిటండీ! ఈ బిగికౌగిలి! బంగారు కలలు కంటున్నారా! లేవండీ..." శ్రీమతి గారి సుప్రభాతంతో ఈ లోకంలోకి ఊడి పడ్డాడు నటవర్.

"ఇదంతా కలయేనా!? స్థాణువుల్లా వుండి పోయాడు, పాపం! నటవర్..."

★

కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

స్థాపితం 1938.

విడి ప్రతి ... 50 పైసలు

సంవత్సర చందా ... రూ. 9-00

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

నేడే చందాదారలుగా చేరండి.

అన్ని హిగ్గిన్ బాథమ్స బుక్ స్టాల్సులో దొరుకును.

♦ కథాంజలి ♦

నెం. 10, మురుగేశ మొదలి వీధి,

మదరాసు - 600 001.